హత్యాయత్నం కేసులో రెండేళ్ల జైలు

జగిత్యాల కలెక్టరేట్/ధర్మపురి, అక్టోబర్ 8: హత్యాయత్నం కేసులో ఒకరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జగిత్యాల అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ప్రసాద్ మంగళవారం తీర్పునిచ్చారు. బుగ్గారం మండలం గోపులాపూర్‌కు చెందిన అన్నదమ్ములు రొండి రవీందర్, రొండి మాణిక్యం మధ్య ఇంటి స్థలం, ఎకరం భూమి విషయంలో కొంత కాలంగా తగాదాలు నెలకొన్నాయి. అలాగే రొండి రవీందర్ మంత్రాలు చేస్తూ తన ఇంట్లోవారికి ఆరోగ్యం బాగా లేకుండా చేస్తున్నాడని మాణిక్యం అనుమానం పెట్టుకున్నాడు. కక్ష పెంచుకున్నాడు. 2018 ఫిబ్రవరి 21న మాణిక్యం కత్తి తీసుకొని తన అన్న ఇంటికి వెళ్లి వదిన రొండి సుజాతపై కత్తితో దాడి చేశాడు. అక్కడే ఉన్న అన్న తిరగబడడంతో మాణిక్యం బైక్‌పై పరారయ్యాడు. దాడిలో సుజాతకు మెడ భాగంలో గాయం కాగా, దవాఖానకు తరలించి, చికిత్స అందించారు. ఈ కేసులో అప్పటి ఎస్ఐ మధుకర్ విచారణ జరిపి మాణిక్యంపై కేసు నమోదు చేశాడు. మంగళవారం నిందితుడిగా రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

విధుల్లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- ఏపీడీ మదన్‌మోహన్
- మల్లాపూర్‌లో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక

సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మదన్‌మోహన్

మల్లాపూర్, అక్టోబర్ 8: విధుల్లో నిర్లక్ష్యం చేసే శాఖా పరమైన చర్యలు తప్పవని ఏపీడీ మదన్‌మోహన్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన 14 విడత ఉపాధి హామీ పనుల మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లోని ఉపాధిహామీ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఉపాధి పనులను పకడ్బందీగా చేపట్టాలని, నిబంధనల మేరకు పనులను చేయించి కూలీలకు డబ్బులను అందించాలని సూచించారు. అలాగే మండల వ్యాప్తంగా 23 గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన రూ.4.60 కోట్ల పనులకు సోషల్ ఆడిట్‌ను నిర్వహించినట్లు చెప్పారు. అయితే వేతనాల చెల్లింపు, మస్టర్లు సక్రమంగా నమోదు చేయకపోవడం, పనుల గుర్తింపులో నిర్లక్ష్యం, మొక్కల సంరక్షణ చర్యలు తీసుకోకపోవడం తదితర కారణాలతో రూ.2,17,383 రికవరీ చేసేందుకు ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లోని సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇక్కడ అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, డీవీఓ చిన్నయ్య, జేవీవీ దేవేందర్, ఇన్‌చార్జి ఎంపీడీవో జగదీష్, ఎస్ఆర్‌పీ సాలయ్య, ఏపీవో సతీష్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కనెక్షన్, రక్షణ కంచె

'నమస్తే' కథనానికి స్పందన

పెగడపల్లి, అక్టోబర్ 8: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు విద్యుత్ సిబ్బంది కనెక్షన్‌తోపాటు రక్షణ కంచెను ఏర్పాటు చేశారు. రద్దీ ప్రాంతంలో, ప్రధాన రోడ్డు పక్కన 'ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు.. కనెక్షన్, కంచె మరిచారు' అనే శీర్షికన ఇటీవల నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. విద్యుత్ ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్ భిక్షపతి స్పందించి, మంగళవారం సమస్యను పరిష్కరించగా, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డిది విధ్వంస పాలన

- మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో పేదోళ్ల కడుపు కొడుతండు
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

రాయికల్, అక్టోబరు 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పది నెలల పాలన విధ్వంసంలా ఉందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. రాయికల్ పట్టణంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పేదోళ్ల కడుపు కొడుతూ పెద్దోళ్ల కడుపు నింపేందుకే మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేశారని, హైడ్రా పేరిట ఇష్టారాజ్యంగా ఇండ్లు పడగొడుతున్నారని మండిపడ్డారు. పథకాల అమలుకు లేని నిధులు, మూసీ నది రివర్ ఫ్రంట్‌కు రూ.1.50లక్షల కోట్లు ఎక్కడి నుంచి వస్తాయో..? చెప్పాలని ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాకు గత ప్రభుత్వం కేటాయించిన నిధులే తప్ప, కాంగ్రెస్ సర్కారు ఇప్పటివరకు రూపాయి ఇచ్చిన పాపానపోలేదని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ పండుగను ఏటా ఘనంగా జరుపుకున్నామని, ప్రస్తుతం కనీస ఏర్పాట్లు చేయడం లేదన్నారు. బతుకమ్మ ఆడే ప్రదేశంలో పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా జరుపలేని స్థితికి దిగజారిపోయిందని మండిపడ్డారు. పాలన మీద అవగాహన లేని వ్యక్తి ముఖ్యమంత్రి కావడం దురదృష్టకరమన్నారు. దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించే విధంగా ముఖ్యమంత్రికి జ్ఞానోదయం కల్పించాలని బీఆర్ఎస్ పక్షాన అమ్మవారిని వేడుకున్నామన్నారు. కార్పొరేట్ కళాశాలను తనిఖీ చేస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ ఒకసారి ప్రభుత్వ గురుకుల స్కూళ్లను సందర్శించాలని, అప్పుడే విద్యార్థుల ఆవేదన అర్థమవుతుందన్నారు. ఇక్కడ రాయికల్ పట్టణ అధ్యక్షుడు అనిల్, మండల మహిళా అధ్యక్షురాలు స్పందన, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, మహేశ్ గౌడ్, సాయి, మహేందర్, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్ ఉదయశ్రీ, మండల సమన్వయ కమిటీ సభ్యులు బర్కం మల్లేష్, నాగరాజు, గంగారాం పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్
- హబ్సీపూర్, సంఘంపల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల ప్రారంభం

హబ్సీపూర్ గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

జగిత్యాల రూరల్, అక్టోబర్ 8: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు బాధ్యతతో పనిచేయాలని జగిత్యాల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సూచించారు. మంగళవారం హబ్సీపూర్, సంఘంపల్లి గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించి, మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ కుల గణన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. అప్పటిదాకా గ్రామాల్లో ప్రత్యేకాధికారులు గత సర్పంచులను మరిచేలా పాలన అందించాలని సూచించారు. పారిశుధ్యానికి పెద్దపీట వేయాలని, సమస్యలు లేకుండా చూడాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని చెప్పారు. దసరా, బతుకమ్మ పండుగల ఏర్పాట్లులో ఎలాంటి లోటు లేకుండా చూడాలన్నారు. అనంతరం హబ్సీపూర్ గ్రామ పంచాయతీ స్థల దాత సుధాకర్ రెడ్డిని ఎమ్మెల్యే సత్కరించారు. కార్యక్రమాల్లో ప్యాక్స్ చైర్మన్లు సందీప్ రావు, మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు రాజేశ్వర్ రెడ్డి, మల్లమ్మ, మాజీ ఉప సర్పంచులు రమేశ్, అంజన్న, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈ మిలింద్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీవో రవి, మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ దామోదర్ రావు, సురేందర్ రావు, కౌన్సిలర్ నారాయణ రెడ్డి, నాయకులు బాల ముకుందం, నక్కల రవీందర్ రెడ్డి, గడ్డం నారాయణ రెడ్డి, మోహన్ రెడ్డి, మహేశ్వర్ రావు, అంజన్న, భుమన్న, దామోదర్ రెడ్డి, చెరుకజాన్, గంగాధర్, రాజేశ్వర్ రెడ్డి, పరుశురాం, నరేష్, మహేశ్, సునిల్ శ్రీరాం, భిక్షపతి, వంశీ, మోహన్, తిరుపతి పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలి

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాలలో చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యం

మల్యాల, అక్టోబర్ 8: బతుకమ్మ పండుగకు మల్యాల మేజర్ గ్రామపంచాయతీతో పాటు మండలంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశించారు. మంగళవారం మల్యాలలో బతుకమ్మను నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మల్యాల గ్రామ పంచాయతీ ఆవరణలో అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, కార్యదర్శులతో సమావేశమై, మాట్లాడారు. ప్రస్తుతానికి ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నందున ఘాట్‌ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం మల్యాల మండల కేంద్రంలోని దుర్గామాతను దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీన్, ఈవో శ్రీకాంత్, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, రాంలింగారెడ్డి, రాజనర్సింగరావు, ముత్యం శంకర్, సంత ప్రకాష్‌రెడ్డి, నల్ల తిరుపతిరెడ్డి, వీరబత్తిని ప్రతాప్, శనిగారపు తిరుపతి, హరినాథ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఇమామ్, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, ముదాం మల్లేశం, అల్లూరి రాజురెడ్డి, నక్క అనిల్, చెవులమద్ది శ్రీనివాస్, పృథ్వీరాజ్, మ్యాక లక్ష్మన్, సాయి, అనిల్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి

- ఓటరు నమోదు గడువుపై విస్తృత ప్రచారం చేయాలి
- రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అధికారులు

జగిత్యాల, అక్టోబర్ 8: రాష్ట్రంలో టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు సంబంధించి ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి నాగిరెడ్డి ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా రూపకల్పనపై వీసీ నిర్వహించగా, అదనపు కలెక్టర్ రాంబాబు పాల్గొన్నారు. ఎన్నికల అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ జిల్లాల ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలు, వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లా ఉపాధ్యాయ స్థానాల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఓటరు నమోదుపై ఈ నెల 16, 25న పత్రికల్లో నోటీసు జారీ చేయాలని సూచించారు. గతంలో ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు కూడా తప్పనిసరిగా ఉపాధ్యాయుల ఫారం -19 ప్రకారం, పట్టభద్రుల ఫారం -18 ప్రకారం కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 6లోపు సమర్పించాలని చెప్పారు. నవంబర్ 1, 2024 ముందు ఆరేండ్లలో కనీసం మూడేండ్లపాటు సెకండరీ స్కూల్ కంటే తక్కువ స్థాయి కాకుండా విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు, నవంబర్1, 2024 కంటే మూడేండ్ల క్రితం అంటే 1 నవంబర్ 2021 నాటికి డిగ్రీ లేదా సమానస్థాయి విద్య పూర్తి చేసుకున్న పట్టభద్రులు ఓటరుగా నమోదు కావడానికి అర్హులని సూచించారు. ఓటరు నమోదు గడువుపై విస్తృత ప్రచారం చేయాలని, జిల్లాలోని డిగ్రీ, ప్రొఫెషనల్ కాలేజీలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులు, అర్హులైన పట్టభద్రులు తప్పనిసరిగా నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు.

ఇరాక్‌లో సారంగాపూర్ వాసి నరకయాతన

- సోషల్ మీడియాల్లో బాధితుడి సెల్ఫీ వీడియో వైరల్
- స్వదేశానికి రప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు

సెల్ఫీ వీడియోలో కంటతడి పెడుతున్న పల్లపు అజయ్

సారంగాపూర్, అక్టోబర్ 8: ఉపాధి కోసం పొట్ట చేతపట్టుకొని ఇరాక్ దేశం వెళ్లిన సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన పల్లపు అజయ్ నరకయాతన అనుభవిస్తున్నాడు. ఏజెంట్ మోసంతో దీనావస్థలో మగ్గుతున్నాడు. 'మంచి జీతం, పని ఉందని ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మి రూ.2.70లక్షలు అప్పుజెప్పి 14 నెలల కింద ఇరాక్ వచ్చిన. ఇక్కడ పాస్‌పోర్ట్ తీసుకుని నన్ను ఓ గదిలో బంధించిన్రు. సరిగ్గా తిండి కూడా పెట్టడం లేదు. నేను ఇక్కడ ఉండలేక పోతున్నా. నన్ను ఎలాగైనా ఇండియాకు రప్పించేలా చూడాలంటూ' బాధితుడి సెల్ఫీ వీడియో సోషల్ మిడియాల్లో చక్కర్లు కొడుతున్నది. విషయం తెలుసుకొని తల్లిదండ్రులు గంగయ్య, రాధమ్మ తల్లడిల్లుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని తమ కొడుకును స్వదేశానికి తీసుకురావాలని వేడుకుంటున్నారు. కాగా, ఇరాక్‌లో ఇరుక్కున్న యువకుడిని ఇండియాకు రప్పించాలంటూ నెటిజన్లు సైతం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో పాటు పలువురికి వీడియో ట్యాగ్ చేస్తున్నారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.



బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..



న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద

ముంబై, అక్టోబర్ 8: దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస నష్టాలకు బ్రేక్‌పడింది. వరుసగా ఆరు రోజులుగా భారీగా నష్టపోయిన సూచీలు తిరిగి కోలుకున్నాయి. బ్లూచిప్ సంస్థల షేర్లకు లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు సూచీలను ముందువైపుకు నడిపించాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 585 పాయింట్లు అందుకొని 81,635 పాయింట్ల వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ సైతం 217.40 పాయింట్లు ఎగబాకి తిరిగి 25 వేల మార్క్‌ను అధిగమించింది. చివరకు 25,013.15 పాయింట్ల వద్ద స్థిరపడింది. మార్కెట్లు ఉవ్వెత్తున ఎగిసిపడటంతో మదుపరుల సంపద భారీ స్థాయిలో పెరిగింది. గత ఆరు సెషన్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా సంపదను కోల్పోయిన మదుపరులు ఒక మంగళవారం నాడే రూ.7 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. దీంతో బీఎస్ఈలో లిస్టైన కంపెనీల మార్కెట్ విలువ రూ.7,51,481.51 కోట్లు పెరిగి రూ.4,59,50,926.21 కోట్లు(5.47 ట్రిలియన్ డాలర్లు)కు చేరుకున్నది. ఆసియా, య